క్లుప్తంగా

108 సేవలను అనవసరంగా వాడొద్దు



బేతంచెర్లలో 108 సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం సంజీవరెడ్డి

బేతంచెర్ల: ప్రాణాపాయ స్థితుల్లో ఉండే వారికే 108 అత్యవసర సేవలు లభించేలా చూడాలని, ఈ సేవలను అనవసరంగా వాడరాదని ఉమ్మడి కర్నూలు జిల్లా 108 డీఎం సంజీవరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి 108 వాహన సేవల వినియోగంపై ఆరా తీశారు. సాధారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందదగ్గ వ్యాధులకు 108 సేవలు ఉపయోగించరాదని, ఆ సేవలను నిజంగా అత్యవసరంగా అవసరమైన వారికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా 108 సేవలు సమర్థవంతత మరింతగా పెరుగుతుందన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

అవుకు: మండలంలోని మెట్టుపల్లె గ్రామానికి చెందిన కోడూరు పెద్ద పాములేటి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

డోన్ టౌన్: విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడీఐపీ పథకం ద్వారా దివ్యాంగులు, వృద్ధుల కోసం అసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ట్రై సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, వాకింగ్ స్టిక్స్, కృతిమ అవయవాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కలశ యాత్రను విజయవంతం చేద్దాం

బనగానపల్లె రూరల్: ఈ నెల 18న బనగానపల్లెలోకి చేరుకునే రెజాంగ్ లా రాజ్ కలశయాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కన్వీనర్ శేష ఫణి యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం ఆవరణంలో జరిగిన అఖిల భారత యాదవ మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత సైన్యంలో ప్రత్యేకంగా అహీర్ రెజిమెంట్ (యాదవ రెజిమెంట్) ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఈ కలశయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఈ యాత్ర కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా సాగుతుండగా, జూలై 3న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమై జూలై 23న నెల్లూరులో ముగియనుందన్నారు. సంఘం నాయకులు శివకృష్ణ యాదవ్, మద్దయ్య యాదవ్, గణమద్దిలేటి యాదవ్, పాండురంగ, శివయ్య, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



ఈయూ ఆవిర్భావ వేడుకలో కార్మికులు

డోన్ టౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ యూనియన్ డోన్ డిపో అధ్యక్షుడు సీతరామిరెడ్డి, రీజినల్ నాయకుడు రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డిపో ఆవరణలో వేడుకలు నిర్వహించారు. డ్రైవర్ సత్యనారాయణ చేతుల మీదుగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేశామని, ఉద్యోగ భద్రత, వేతన సవరణ వంటి అంశాల్లో విజయాలు సాధించామని గుర్తు చేశారు. యూనియన్ నాయకులు గోపాల్, దాసు, రాముడు, హుస్సేన్, టీవీఆర్ రెడ్డి, బాషా, ఎంఎస్ రెడ్డి, మౌలాలి, శివ తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో సీసీరోడ్లు ప్రారంభం

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో మూడు చోట్ల రూ.40 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. అనంతరం అవుకులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చీరసారె సమర్పించారు. మండలస్థాయి అధికారులు, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

కురవని వానలు..
ఎదగని పంటలు

- నిండని చెరువులు
- బోరు బావుల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- వాడుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు



వరిసాగు చేయకపోవడంతో బీళ్లుగా కనిపిస్తున్న వరిమళ్లు



వాడుతున్న మొక్కజొన్న పంట

కొలిమిగుండ్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40 రోజులు దాటినా ఇంకా సరైన వర్షాలు పడకపోవడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ మొదటి వారం నుంచే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా, మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలకే పరిమితం కావడం వల్ల సాగు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చాలా మంది రైతులు పొలాలను దుక్కి దున్ని వాన కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న, కంది, జొన్న, నూగు పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం 130 హెక్టార్లకు పైగా మొక్కజొన్న సాగులో ఉంది. విత్తనాలు విత్తుకునేందుకు ఈనెల 15 వరకు అనుకూలమైన సమయంగా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కొంచెం ఆలస్యమైనా నెలాఖరు వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తే తేలిక పాటి వర్షాలకే పరిమితమవుతున్నాయి. చాలా మంది రైతులు వర్షం వస్తుందనే ఆశతో మొక్కజొన్న పండించారు. తీరా వరుణుడు ముఖం చాటేయడంతో పంట వాడు ముఖం పడుతోంది.

నిండని చెరువులు

వర్షాకాలంలోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని కారణంగా చెరువులు వెలవెలబోతున్నాయి. కొలిమిగుండ్ల మండలంలోని ఐదు చెరువులు పూర్తిగా అడుగంటిపోయాయి. ఈపాటికి వర్షాలు కురిసి ఉంటే చెరువుల్లో జలకళ సంతరించుకుని ఉండేదని రైతులు అంటున్నారు. పేరుకే వర్షాకాలం అయినా భూగర్భ జలాలు మాత్రం పెరగలేదు. రెండు నెలలకు సంబంధించి లోటు వర్షపాతం నమోదవుతోంది. వరుణుడు కరుణిస్తే మొక్క జొన్న పంటకు ఊపిరిపోసినట్లవుతుందని రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వాడు పడుతున్నాయి. బోర్లలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో మొక్కజొన్నకు డ్రిప్ ద్వారా నీళ్లు కట్టుకుంటున్నారు. ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. బోర్లలో ఉన్నట్టుండి నీళ్లు తగ్గడంతో చీని, మామిడి, అరటి తదితర పంటలను ఎలా కాపాడుకోవాలోనని ఆందోళన చెందుతున్నారు.

బీళ్లుగా మారిన వరిమళ్లు

నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా పలకరించడంతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు ఎంతో సంతోషించారు. చివరకు వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. అబ్దులాపురం, కోరన్నపల్లె, తోళ్లమడుగు తదితర గ్రామాల్లో 500 ఎకరాలకు పైగానే బోర్ల కింద వరి సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి మళ్లు నాట్లతో పచ్చగా కళకళలాడుతూ కనిపించాల్సింది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. బోర్లలో పూర్తిగా భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో రైతులు ఇంత వరకు నార్లు పోయకపోవడంతో వందల ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. కొంత మంది రైతులు బోర్లలో కొంత మేర నీళ్లు ఉండటంతో వర్షాలు కురుస్తాయనే ఆశతో ధైర్యంగా నారు చల్లుకుంటున్నారు. వ్యవసాయ పనులు జోరందుకోవాల్సిన సమయంలో వర్షం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ కూలీల పరిస్థితి చెప్పనక్కర లేదు. వ్యవసాయ పనులు పూర్తిగా ఆగిపోవడంతో కూలీలకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాన దేవుడు కరుణిస్తే తప్ప ఈ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే అవకాశమే లేదన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది.

మొక్క జొన్న వాడిపోతుంది



ఏడు ఎకరాల్లో బోర్ల కింద మొక్కజొన్న సాగు చేశాను. ఇప్పుడు బోర్లలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. పంట వాడు ముఖం పడుతోంది. ఏం చేయాలో దిక్కు తెలియడం లేదు. నీళ్లు తగ్గడంతో వృథా కాకుండా డ్రిప్ సాయంతో పంటకు నీళ్లు పెట్టాం. రోజు రోజుకు బోర్లలో అడుగంటిపోతున్నాయి. వర్షం కురిస్తే తప్ప సమస్యకు పరిష్కారం ఉండదు.

–శ్రీనివాసరెడ్డి, అబ్దులాపురం

రెండేళ్లుగా సరైన వానలు లేవు



రెండేళ్ల నుంచి వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సాధారణంగా పది ఎకరాల్లో వరి సాగు చేస్తాను. ఈ దఫా వాన జాడ లేక బోర్లలో చుక్క నీరు లేకుండా పోయింది. ఈసారి నారు పోసేందుకు వడ్లు తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది ఇదే పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తేనే బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. పైర్లతో పచ్చగా ఉండాల్సిన భూములు బీళ్లుగా ఉంటున్నాయి.

–దస్తగిరి, కోర్నపల్లె

ఆశతో నారు వేస్తున్నాను



నాకున్న 2.80 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు నారు మడి చల్లుకున్నాను. ఇప్పుడు బోరులో నీళ్లు అంతంత మాత్రమే ఉన్నాయి. వర్షం కురిసి బోర్లలో నీళ్లు పెరుగుతాయనే ఆశతోనే నారు పోశాను. చివరకు ఏమవుతుందో చూడాలి. చాలా మంది రైతులు బోర్లలో నీళ్లు లేక నార్లు పోసుకోలేదు. వాన దేవుడి కోసం ఎదురుచూస్తున్నాం.

– సంజప్ప,అబ్దులాపురం

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి అవకాశం



అవగాహన కల్పిస్తున్న జడ్జి మల్లీశ్వరి

డోన్ టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులో పెండింగ్‌లో ఉన్న పలు కేసులను ఇరువర్గాల సమ్మతి మేరకు, ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చని డోన్ సబ్‌కోర్టు న్యాయమూర్తి మల్లీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం డోన్ బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ న్యాయ సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఇరు పక్షాలు మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ అయితే, కోర్టు ఫీజు కూడా తిరిగి లభిస్తుందని తెలిపారు. ఇలాంటి పరిష్కారాలకు అప్పీలు అనేది ఉండదన్నారు. రాజీ కుదరకపోతే మాత్రం తిరిగి కోర్టులో కేసు నడిపించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది నందిపల్లె నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, కోశాధికారి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి కుమారి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు భరోసా



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: పేద కుటుంబాలకు 'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమం భరోసా కల్పిస్తుందని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, వీఆర్‌ఓలతో పీ–4పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పనిచేస్తున్న గెజిటెడ్‌స్థాయి అధికారులు ఒక్కొక్కరు మూడు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటారన్నారు. ఆ కుటుంబ అవసరాలను గుర్తించి దాతల సహకారంతో వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు, ఆర్‌ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ముదిగేడులో అధికారులతో మాట్లాతున్న పీడీ

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు, హోత్రమాన్‌దిన్నె, వసంతాపురం, ఆకుమల్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనుల ద్వారా ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఉద్యానపంటలతో స్థిరమైన ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఉద్యాన పంటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. అలాగే అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజేయత, ఏపీఓ జయంతి తదితరులు ఉన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని వన్ టౌన్ ఫీడర్ పరిధిలో 11 కేవీ మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్, శ్రీకృష్ణ నగర్, మహాలక్ష్మీ హాస్పిటల్, పండరీనగర్, పాతపేట, కొండపేట, రైతుమిత్ర నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే మల్యాల సబ్ స్టేషన్ పరిధిలోని యాపదిన్నె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుతున్న దృష్ట్యా యాపదిన్నె, ఎద్దుపెంట, తాడూరు గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు శనివారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తామని వివరించారు.

- **బనగానపల్లె:** మండలంలోని పలుకూరు, యనకండ్ల సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు రూరల్ ఏఈ గర్జప్ప శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 గంటల తర్వాత సరఫరా చేస్తామని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

డోన్ టౌన్: బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్న మల్కాపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. యర్రగుంట్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు కుమార్తె ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన మధు (22) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రంగాపురంలో ఉంటున్న అక్క దగ్గరకు వెళ్లడానికి శుక్రవారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. చిన్న మల్కాపురం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వారాహిమాత.. నమోస్తుతే

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో ఆషాడ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో వారాహిమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు వారాహిమాతను కొలువుంచి పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. అలాగే వాసవీ మాతకు కూడా విశేష పూజలు చేశారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

- ఆక్రమణలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు
- అధికారులు లంచాలు తీసుకుని ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల హెచ్చరిక
- నోరు మెదపని అధికారులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



టౌన్‌ప్లానింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

డోన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వంద పడకల ప్రభుత్వాస్పత్రి సహా అనేక ఆధునిక భవనాలను నిర్మిస్తే వాటిని పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి శబరీష్ వ్యవహార శైలిపై కౌన్సిలర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. జాడీల ఫ్యాక్టరీ, ఆధునిక కూరగాయల మార్కెట్, బుగ్గన మార్గ్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణాల్లో ప్రైవేట్ ఏటీఎంలు, బంకుల ఏర్పాటుకు అధికారులు లక్షల రూపాయల లంచాలు తీసుకున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. రక్తపరీక్షల ల్యాబ్ నిర్మించాల్సిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారని మండిపడ్డారు.

చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే

పట్టణంలో విచ్చలవిడిగా జరుగుతున్న మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై ఎన్నిసార్లు సభలో కౌన్సిలర్లు ప్రస్తావించి తీర్మానాలు ప్రవేశపెట్టినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, విమల, సుమలత సురేష్ ఆరోపించారు. అధికారులు ప్రజాప్రతినిధుల మాటలను గౌరవించకుండా అహంకారంతో వ్యవహరించడం సరికాదన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా

ఇటీవల జరిగిన ఆక్రమణలను తొలగించమని కౌన్సిలర్లు కోరితే పట్టణ వ్యాప్తంగా ఉన్న పేదల దుకాణాలన్నింటినీ తొలగించాలని నోటీసులు ఎలా జారీ చేస్తారని సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య నిలదీశారు. ఫ్లైఓవర్ కింద అభివృద్ధి చేసేందుకు తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు అందరికీ నోటీసులు జారీ చేస్తుండటాన్ని తాము వ్యతిరేకిస్తామన్నారు. లంచాలు తీసుకొని ఉన్న వారి బంకుల జోలికి వెళ్లకుండా నిరుపేదల బంకులను తొలగించడం సమంజసమా అని నిలదీశారు.

సీపీఐ కౌన్సిలర్ వాకౌట్

గత ఏడాది నుంచి గుత్తి రోడ్డులోని క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మించాలని పలుమార్లు వినతులు సమర్పించినా పట్టించుకోని అధికారులు ఎమ్మెల్యే చెబితే చేస్తామనడం సరైన పద్ధతి కాదని కౌన్సిలర్ సుంకయ్య అన్నారు. తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకం కాదని, అధికారుల వ్యవహార శైలికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. మరో పదిరోజుల్లో ఆక్రమణలు తొలగించకుంటే ఆందోళన చేపడతామని కౌన్సిలర్లు సుంకయ్య, ఆర్ట్ రమణ, వెంకటేశ్వరమ్మ, శివలక్ష్మి హెచ్చరించారు.

శ్మశాన వాటికలకు స్థలం కేటాయించండి

పట్టణ జనాభా నానాటికి పెరిగిపోతుండడంతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల కోసం 5 ఎకరాల చొప్పున స్థలాలు కేటాయించాలని చైర్మన్ సప్తశైల రాజేష్ తహసీల్దార్ రవికుమార్‌ను కోరారు.

అధికారులపై వైస్ చైర్మన్ ధ్వజం

పట్టణానికి 200 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరమైతే కేవలం 100 మందితోనే పనులు సాగిస్తున్నారని టీడీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ విమర్శించారు. ఏడాది కాలంగా అదనపు సిబ్బందిని నియమిస్తానని చెప్పి పట్టించుకోకపోవడంతో పట్టణంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, విద్యుత్, హౌసింగ్, రెవెన్యూ అధికారులు, డీఈ రఘు, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

కాన్పుకు మధ్య అంతరం అవసరం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె: ప్రతి కాన్పుకు మధ్య అంతరం పాటిస్తే ఆరోగ్యకరమైన ప్రసవం సాధ్యపడుతుందని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ సోహైల్‌బాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా టంగుటూరు గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇద్దరూ లేదా ముగ్గురు సంతానం చాలని తెలిపారు. కాన్పుకు కాన్పుకు మధ్య అంతరం పాటించేందుకు తీసుకోవాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ ఓబులేసు, సూపర్‌వైజర్ ఆయమ్మ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

ప్యాపిలి: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారులు రంగారెడ్డి, రాహుల్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలకు హాజరు కావాలన్నారు. గర్భంలో శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మధుప్రియ కుటుంబ సభ్యులకు పరామర్శ



చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప గ్రామంలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి కె.మధుప్రియ కుటుంబ సభ్యులను డోన్ ఆర్డీఓ నరసింహులు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. చిన్నారి తల్లిదండ్రులు జయరాముడు, రామేశ్వరితో ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గ్రామంలో వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజులారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మనోజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా శంకలాపురం బ్రిడ్జి



శంకలాపురం సమీపంలోని బ్రిడ్జి

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకలాపురం గ్రామ రహదారిలో ఉన్న చిన్నపాటి బ్రిడ్జి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి ద్వారా శంకలాపురం సహా మరో నాలుగు గ్రామాల ప్రజలు రోజూ బేతంచెర్లకు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. మధ్యభాగంలో వర్షపు నీరు నిలిచి ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదంలో పడ్డ ఉదంతాలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సమస్యను గమనించి, కొత్త బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ గోడ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దాదాపు 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో మౌలిక వసతుల కల్పన జరగకపోవడమే కాకుండా, ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ కూడా లేకపోవడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే పశువులు విద్యుత్ షాక్‌కు గురై మరణించిన సంఘటనలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–డోన్